కాల్వ తవ్వారు... పనులు నిలిపేశారు

ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వ్యాపారులకు ఫీట్లు తప్పడం లేదు. డ్రైనేజీని తొలగించి 20 రోజుల వుతున్నా నూతన కాల్వ పనులు ప్రారంభించకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. డ్రైనేజీ లేని కారణంగా ఇటీవల వర్షాలకు సిద్దవటం రోడ్డు జలమయమైంది.

- 20 రోజులుగా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్
- వ్యాపారులకు, వినియోగదారులకు తప్పని ఫీట్లు


దుకాణాల ఎదుట నిచ్చెన వేసుకున్న వ్యాపారులు

బద్వేలు అర్బన్: పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఆర్టీసీ బస్టాండు అవుట్‌గేట్ నుంచి అపోలో ఫార్మసీ వరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.30 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. మూడు నెలల క్రితం టెండర్లు పిలవగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 20 రోజుల కిందట పాత డ్రైనేజీని తొలగించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పిన కాంట్రాక్టర్ నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం కాలువ తీసి.. పత్తా లేకుండా పోవడంతో వ్యాపారులు ఇబ్బందిపడుతున్నారు. దుకాణాల్లోకి వెళ్లేదుకు వ్యాపారులు నిచ్చెనలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రైనేజీ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో 50 దుకాణాలున్నా.. సరైన మార్గం లేకపోవడంతో వ్యాపారాలు మందగించాయని వ్యాపారులు వాపోతున్నారు. కొద్దిపాటి నిచ్చెన ద్వారా దుకాణాల్లోకి వెళ్లేందుకు ఫీట్లు తప్పడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే జలమయం

సిద్దవటం రోడ్డులోని ప్రధాన డ్రైనేజీ నిర్మాణం కోసం కాలువ తీసి వదిలేయడంతో మురుగు వెళ్లే మార్గం లేక ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షానికి సిద్దవటం రోడ్డు జలమయమైంది. సుమారు మోకాలి లోతు నీరు చేరి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. వర్షపునీరు నిలిచి రెండు దుకాణాలు కూలిపోగా రెండు శిథిలమయ్యాయి.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

సిద్దవటం రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన కాలువలోకి దుకాణాల నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో పనుల నిర్వహణలో జాప్యం జరిగింది. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– సుమన్‌రెడ్డి, మున్సిపల్ డీఈఈ

త్వరగా పనులు పూర్తి చేయాలి



సిద్దవటం రోడ్డులో డ్రైనేజీ పనుల కోసం కాలువ తవ్వి అలాగే వదిలేశారు. 20 రోజులుగా వ్యాపారాలు జరగడం లేదు. దాదాపు 50 మంది దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయించాలి.

– సరిటాలమౌలాలి, వ్యాపారి, సిద్దవటం

వ్యాపారాలు జరగడం లేదు



కాలువ తీసి అలాగే వదిలేయడంతో వ్యాపారాలు సక్రమంగా జరగడం లేదు. నెల వచ్చేసరికి వేలకు వేలు బాడుగలు చెల్లించాలి. వ్యాపారం జరగకపోతే ఎలా చెల్లించాలి. మురుగు నిల్వ ఉండడంతో దుకాణం కింది భాగం దెబ్బతింది. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– షేక్‌రంతుబాష, వ్యాపారి, సిద్దవటం రోడ్డు

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు: స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో(ఆర్ట్స్‌కాలేజీ) 2025–26 విద్యా సంవత్సరానికి గానూ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. హిస్టరీ, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు 55 శాతం మార్కులతో పీజీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, అనుభవం గల వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో గురువారం ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినతి

ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరంలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ కోరారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బాలన్నకు బుధవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపవరం పంచాయతీలోని మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయిందని తెలిపారు. వర్షాకాలం కావడంతో దోమలు ఎక్కువై ప్రజలు మలేరియా, డెంగీ, విషజ్వరాల బారినపడి అల్లాడుతున్నారని తెలిపారు. కాలువల్లో పూడిక తొలగించి, దోమల నియంత్రణకు ఫాగింగ్, మందు పిచికారీ చేయాలని కోరారు.

నేడు బిషప్ రాక


సంతోష్‌ప్రసన్నరావు

కలసపాడు: నంద్యాల డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావు స్థానిక పరిశుద్ధ పరిపేతురు పరిశుద్ధ పౌలు చర్చిని గురువారం సందర్శించనున్నారని చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పది గంటలకు సంతోష్ ప్రసన్నరావు, ఆయన సతీమణి బ్యూలా జాస్మిన్ దంపతులు, డయాసిస్ అధికారులను స్థానిక మూడు రోడ్ల కూడలి నుండి పురవీధుల గుండా చర్చి వరకు ఊరేగింపుగా తీసుకువస్తారన్నారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు, సన్మానం ఉంటాయన్నారు.

కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. మైదుకూరు, ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణలో భాగంగా కల్వర్టు నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కల్వర్టు నిర్మాణంతో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ నుంచి వచ్చే వర్షం నీరు, మురుగు తగ్గు ప్రాంతాలకు వెళతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తోటమహేశ్వరరెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, నంద్యాల హరినాథరెడ్డి, సౌభాగ్యమ్మ, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఇస్మాయిల్, షాబీర్ హుస్సేన్, గురప్ప, నాగేశం పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

ప్రొద్దుటూరు: ఓటు చోరీని అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా అన్నారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, మండలంలో ఓటు దొంగ – గద్దె దిగు కార్యక్రమాన్ని గత నెల రోజులుగా నిర్వహించామన్నారు. ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, కాంగ్రెస్ నేతల పిలుపు మేరకు విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రజల గళం వినిపించక లేకపోవడం ఆందోళకరమన్నారు.

హామీలు అమలుచేయాలి

బద్వేలు అర్బన్: విభజన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ హామీ అమలు చేయకుండా మోదీ రాష్ట్ర పర్యటనకు రావడం తగదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలోని జెపీ భవన్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు వెనుకబడిన ఆంధ్ర ప్రదేశ్‌ను అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పి.. ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీను, కృష్ణ, మునిరత్నం, తిమోతి, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

గోపవరం: మండలంలోని రాచాయపేట ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వేముల వెంకటేష(47) బుధ వారం మృతిచెందారు. రాచాయపేటలో ఈకేవైసీ నమోదు చేస్తుండగా పెరాలసిస్ సోకి కిందపడి పోయారు. నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు.

వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం


మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

మైదుకూరు: వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం ఎంతో ఉందని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. స్వచ్ఛత సేవ, మహిళా రైతు దినోత్సవం సందర్భంగా వనిపెంట జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో కేవీకే శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సపోటా, నిమ్మ తదితర పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు రైతులుగా, రైతు కూలీలుగా పంటలను పండిస్తూ ఆహార భద్రతలో కీలకంగా మారుతున్నారని కొనియాడారు. పరిశుభ్రత విషయంలోనూ వారి పాత్ర ఉందని, విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత అలవర్చుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సూచించారు. మొక్కలు నాటుతూ స్వచ్ఛ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు టి.విజయనిర్మల, కాంతిశ్రీ, ప్రిన్సిపల్ వి.నిర్మల విద్యార్థులు పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం

ప్రొద్దుటూరు: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, న్యాయవాది అబ్బాస్, న్యాయవాది హరిత డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటన నేపథ్యంలో ప్రొద్దుటూరులో విలేకరులతో బుధవారం వారు మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి, సంక్షేమంపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కర్నూలులో ఏర్పాటుచేయదలచిన న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఆంధ్ర ప్రాంతానికి తీసుకెళ్లారన్నారు. 1937 శ్రీబాగ్ ఒప్పందం అమలు చేసి రాయల సీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మిషన్ రాయలసీమ పేరుతో కర్నూలు జిల్లాను అగ్రికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారని గుర్తు చేశారు. రాజధాని పేరుతో రాయలసీమలోని పరిశ్రమలను, విద్యాసంస్థలను అమరావతి, గుంటూరుకు తరలిస్తున్నారని విమర్శించారు. రాయలసీమకు హక్కుగా రావాల్సిన సాగు, తాగునీరు ఇవ్వాలని, నిధులు, ఉద్యోగాల్లో వాటాను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విష్ణు నాయక్, రజిని, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రమణారెడ్డి

పోరుమామిళ్ల: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల వైఖరి చూపాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి కోరారు. స్థానిక ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో కన్వీనర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలతో పోరాడి సాధించుకున్న ప్రయోజనాలకు ప్రస్తుత ప్రభుత్వాలు తూట్లు పొడుస్తూ విద్యా రంగాన్ని తిరోగమన బాట పట్టించడం బాధాకరమన్నారు. సకాలంలో రావాల్సిన డీఏ, పీఆర్సీ, ఐఆర్, సరెండర్ లీవ్ బిల్లులు, డీఏ పీఆర్సీ బకాయిలు చెల్లించక దాటివేత ధోరణి అవలంబించడం అన్యాయమన్నారు. ఈ నెల 26న ఎస్టీయూ సర్వసభ్య సమావేశం జరుగుతుందని, ఉపాధ్యాయులు, మేధావులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ప్రపంచం గర్వించదగిన శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం


ప్రొద్దుటూరు కల్చరల్: కలాం చిత్రపట వద్ద నాయకుల నివాళి


మైదుకూరు: విద్యా సామాగ్రి అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు


బద్వేల్ అర్బన్: అబ్దుల్ కలాంకు నాయకుల నివాళి

కాశినాయన: మండలంలోని బాలాయపల్లె, ఆకుల నారాయణపల్లె ఎంపీపీ పాఠశాలల్లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఖాసీం వలి, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అబ్దుల్ కలాం సామాన్య కుటుంబంలో జన్మించి, పట్టుదల, దీక్షతో కన్న కలలను సాకారం చేసుకున్నారన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన సేవలందించారన్నారు.

బద్వేలు అర్బన్: ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్‌కలాం అని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా బుధవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌కలాం నీతి, నిజాయితీ, ఆయన జీవన విధానం, దార్శనీకతను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి బ్రహ్మయ్య, గంగన్న, జి.పుల్లయ్య, పిచ్చయ్య, రాఘవరెడ్డి, ఆనందరావు, రామసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్: పట్టణంలోని శ్రీరాములపేట ఉపాధ్యాయ సేవాకేంద్రంలో బుధవారం ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, అబ్దుల్ కలాం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులరెడ్డి, పద్మవీరన్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం బాల్యంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణి ప్రయోగరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి భారత క్షిపణి పితామహుడుగా పేరొందారన్నారు. ఆయన జన్మదినాన్ని ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి 2015లో ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కోటా ఓబుళరెడ్డి, శీను, చంద్రశేఖర్, గురివిరెడ్డి, షేక్షావలి, కార్తీక్, భాగవతార్ యడవల్లి రమణయ్య, గాజుల శీను, చందు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు: మండలంలోని డయాంఖాన్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేద కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా భారత రక్షణ రంగానికి, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సుజాత, సుధాపరిమళ, వాగ్దాడం శివశంకర్, సతీష్‌బాబు పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ సీసాల పంపిణీ


సీసాలు అందజేస్తున్న దాతలు

పోరుమామిళ్ల: గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మదర్ థెరెస్సా ఫౌండేషన్, బ్లెస్డ్ బ్రెయాన్ ఫౌండేషన్ సంయుక్తంగా పట్టణంలోని విద్యా సంస్థలకు హ్యాండ్‌వాష్ సీసాలు పంపిణీ చేశాయి. ఫౌండేషన్ నిర్వాహకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి, డాక్టర్ అమితారెడ్డి, ప్రజ్వలారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ తెలుగు, ఉర్దూ ఉన్నత పాఠశాలలు, ఓఎల్‌ఎఫ్ బాలికోన్నత పాఠశాలలకు 40 బాటిళ్లను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంబాషా, తులసిసురేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

మైదుకూరు: వంశపారంపర్యంగా కులవృత్తి చేసుకుంటున్నామని.. తమ వృత్తిలోకి ఇతరులు చొరబడవద్దని మైదుకూరు నాయీ బ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర వృత్తుల వారు సెలూన్ షాపులు పెట్టడాన్ని నిరసిస్తూ నాయీ బ్రాహ్మణులు పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో కొందరు ఇతర కులాలవారు హెయిర్ కటింగ్ సెలూన్ షాపులు ఏర్పాటుచేసి ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో క్షౌర వృత్తి చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాల వ్యక్తులతో పనులు చేయిస్తూ తమ కడుపు కొట్టడం సమంజసం కాదన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో ఎమ్మెల్యే సుధ, నాయకులు

గోపవరం: మండలంలోని గోపవరం సర్పంచ్ తోడేటివెంకటలక్షుమ్మ కుమారుడు పవన్, స్నేహల వివాహ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట సుందర్‌రామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, గోపాలస్వామి, సరస్వతి, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


కోటి సంతకాల ప్రతులను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు: ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని, మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. దువ్వూరులోని వైఎస్సార్‌సీపీ నేత వీవీ.స్వామి నివాసంలో మెడికల్ కాలేజీలపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సూపర్–6 పథకాల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి.. ఒక్క సిలిండర్‌కే డబ్బు వేసి మిగిలిన సొమ్ము ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఉన్న పిల్లలందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి.. ఇపుడు 60 శాతం మందికే ఈ పథకం వర్తింపజేశారని విమర్శించారు. 40 శాతం మంది మహిళలను ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి రూ.5 వేలు ఇచ్చారన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వలేదన్నారు. జగన్ విద్య, వైద్య రంగానికి విశేష కృషి చేశారని, జగన్ ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ నిర్మించాలని కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు ధనార్జనే లక్ష్యంగా మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. ఎంబీబీఎస్ సీట్‌కు ప్రైవేటు కాలేజీల్లో ఏడాదికి రూ.27లక్షలు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వ తీరుతో పేద వారికి ఆధునిక వైద్యం అందదన్నారు. ప్రజలతో కోటి సంతకాలు సేకరించి మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం కాకుండా గవర్నర్‌కు అందిస్తామన్నారు. అమరావతిలో కొత్తగా రూ.60 వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని, వాటితో ఎవరికీ ఉపయోగం లేదన్నారు. చంద్రబాబు తమ వారి భూములు కాపాడేందుకు అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. యూరియా, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంటే ప్రభుత్వం అడ్డుకోలేకపోతోందన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా నుంచి మిషన్లు తెప్పించి నకిలీ మద్యం తయారుచేస్తుంటే ప్రభుత్వం కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందన్నారు. ప్రతి గ్రామంలో నాలుగు నుంచి ఐదు మద్యం షాపులను ఏర్పాటుచేసి అమ్ముతున్నా ప్రభుత్వం అడ్డుకోలేకపోతోందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, కానాల జయచంద్రారెడ్డి, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, కోగటం వీరారెడ్డి, బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, విజయగోపాల్‌రెడ్డి, కె.ఓబుళకొండారెడ్డి, చిరాకి బాషా, పీవీ.రమణయ్య నాయుడు, తుమ్మల మస్తాన్‌రెడ్డి, చిన్న, కుంపటి ఖాజాపీర్, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, ఖాదర్‌బాషా, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, చెంద్రాయుడు, మాబు షరీఫ్, శ్రీనివాసులరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రసూల్ గౌస్, రామయ్య, రామమునిరెడ్డి, పాల్గొన్నారు.

పార్టీకి పనిచేసే కార్యకర్తలకే ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: పనిచేసే కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో బుధవారం సాయంత్రం పార్టీ కమిటీల ఏర్పాటు సన్నాహక సమావేశం నిర్వహించారు. రాచమల్లు మాట్లాడుతూ పనిచేయడానికి ఆసక్తి ఉన్న వారినే కమిటీలో నియమిస్తామన్నారు. ఎవరినీ బలవంతం చేయొద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిటీలో ఉన్నవారికి తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు జగన్ న్యాయం చేశారని, మూడో వార్డులో సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల నియామకం జరిగిందన్నారు. తాను ఓటమి పాలైనా కుంగిపోలేదని, ప్రజా తీర్పును శిరసావహించానని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి ప్రజలు మోసపోయారని, హామీ ఇచ్చిన ఏ ఒక్కటైనా సక్రమంగా అందిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మూడో వార్డు ఇన్‌చార్జి కృష్ణార్జునరెడ్డి, మహబూబ్‌బాషా, కేకే.ప్రసాద్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గజ్జల కళావతి, పార్వతి, గోనాప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రొద్దుటూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. తన స్వగృహంలో మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం ద్వారా జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం


గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

బద్వేలు అర్బన్: విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యమని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏడీ.దేవదత్తం, జిల్లా గౌరవ సలహాదారు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే మూఢ విశ్వాసాలపై అపోహలను తొలగించుకోవాలన్నారు. ఈ నెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12 నుండి 14వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో చెకుముకి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శివప్రసాద్, పవన్‌కుమార్, కోశాధికారి లాజర్ పాల్గొన్నారు.

రామేశ్వరం పాఠశాలకు స్వచ్ఛ పురస్కారం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు

పోరుమామిళ్ల: మండలంలోని రామేశ్వరం ఆదర్శ పాఠశాలకు స్వచ్ఛ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు వెంకటయ్య, కొండిశెట్టి బుధవారం ఉపాధ్యాయ బృందాన్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎంఈఓలు మాట్లాడుతూ స్వచ్ఛ అవార్డు రామేశ్వరం పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డు టీచర్ రామకృష్ణారెడ్డి అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు బాలరాజు, పుల్లయ్య మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి ఎక్కడ పనిచేసినా ఆయా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. పదవీ విరమణ చేసినా పాఠశాల బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం: టపాసుల దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని టూటౌన్ సీఐ సదాశివయ్య తెలిపారు. మోడంపల్లె బైపాస్ రోడ్డులోని బాణ సంచా విక్రయ దుకాణాలను బుధవారం సాయంత్రం సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దుకాణాల సముదాయాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. టపాసులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని పేర్కొన్నారు.

రైతులకు యూరియా ఇచ్చి ఆదుకోండి

ఖాజీపేట: అధిక వర్షాలకు ఖాజీపేట మండలంలో పంట నష్టపోయిన ఉల్లి రైతులకు రూ.5 వేల పరిహారం ఇవ్వండి.. యూరియా ఇచ్చి రైతులను ఆదుకోండి అంటూ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తమ సమస్యలపై సభ్యులు నిలదీయడంతో సమావేశం వాడీ వేడిగా సాగింది. విద్యుత్తు సమస్యలను చెబుతామంటే.. అధికారులు ఎవరూ హాజరు కాలేదని రావులపల్లె ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది గొడవపడుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రావుల్ల గ్రామంలో ఈ క్రాప్ బుకింగ్ జరగడంలేదని తెలుపగా హార్టికల్చర్ సిబ్బంది ఈ క్రాప్ చేయలేదని, ఈ విషయం కలెక్టర్‌కు విన్నవించామని ఏవో తెలిపారు. ఖాజీపేట బీసీ కాలనీలోని సర్వే నెంబర్ 614లో 26.65 ఎకరాల వంక పోరంబోకు స్థలం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన స్థలంలో పార్క్, మైదానం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దుంపలగట్టు కాలనీలోని 25 ఎకరాల స్థలంలో సోలార్ యూనిట్ పెడితే పేదలకు సెంటు స్థలం ఉండదని, నాగసానిపల్లె ప్రభుత్వ భూముల్లో ఏర్పాటుచేయాలని ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. దుంపలగట్టు డీలర్‌వద్ద 29 క్వింటాళ్ల బ్యాక్‌లాగ్ ఉందని, లబ్ధిదారులకు బియ్యం ఎలా పంచాలని రెడ్యం రవీంద్రారెడ్డి నిలదీశారు.